క్లుప్తంగా

ధర్నాను విజయవంతం చేయండి

కమలాపురం : కడప కలెక్టరేట్ వద్ద ఈనెల 13వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీఆర్‌ఏల రోజువారి పనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, యూనియన్ కార్యదర్శి రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట

పులివెందుల టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీనారాయణ కల్యాణ నాగులకట్ట దేవస్థానంలో ఉమామహేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ట, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడంతో హోమాది కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ తెలిపారు. బుధవారం పొలతల క్షేత్రంలో చేపడుతున్న ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చెన్నూరు : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ కవిత తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని ముండ్లపల్లె ఎంపీపీ స్కూలులో, ఓబులంపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, న్యాయవాది చంద్రకాంతమ్మ, ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పారా లీగల్ వలంటీర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పుతో శారీరక, మానసిక ఎదుగుదల

చెన్నూరు : అయోడిన్ ఉప్పు వాడడం వల్ల పిల్లల్లో శారీరక మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అయోడిన్ ఉప్పు వాడటం వల్ల శరీరానికి కావాల్సినంత సూక్ష్మ పోషకాలు లభ్యమవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి ఉమామహేశ్వరకుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణకు విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ పోరల్ పోస్టులలో బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తామని సీఈ చెప్పారని వారు తెలిపారు. అనంతరం వారు బీసీ సంఘం నూతన క్యాలెండర్‌ను, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి.అనూరాధ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుణవంతుడు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జీ.వెంకటసుబ్బయ్య, చీఫ్ అడ్వైజర్ చంద్రమౌళిలతో పాటు ఆర్టీపీపీ అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని అరికట్టవచ్చు

వల్లూరు : స్పర్శలేని పొడలను ప్రాథమిక దశలో గుర్తించి సరైన చికిత్స పొందడం ద్వారా కుష్టు వ్యాధిని అరికట్టవచ్చునని జిల్లా అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఖాదర్‌వల్లి తెలిపారు. మండలంలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు, పీహెచ్‌ఎన్ నిర్మల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

చెన్నూరు : మండలంలోని బుడ్డాయపల్లెకు చెందిన ఆర్‌ఆర్ పాఠశాల కరస్పాండెంట్ టీఎం పరమేశ్వర్‌రెడ్డి తల్లి రామలక్షుమ్మ బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతురాలి ఇంటికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

కల్యాణ వైభోగమే..

- ఘనంగా శ్రీవేంకటరమణుడి కల్యాణం
- ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సతీసమేత శ్రీకల్యాణ వేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డున వెలసిన శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటరమణుడి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం నాటితో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయంలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలు, వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటరమణస్వామి కల్యాణం భక్తకోటి పులకించేలా అంగరంగ వైభవంగా జరిగింది. సుగంధ దివ్యపరిమళ పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా కంకణ ధారణ, అగ్రిహోత్రం, యజ్ఞోపవేతం గావించి అనంతరం మహామంగళ సూత్రాలకు పూజలు చేసి భక్తులకు చూపిస్తూ స్వామి వారికి అందించి అమ్మవార్ల మెడలో మాంగళ్యధారణ చేశారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకించారు. గోవిందా నామస్మరణలతో ఆలయం మారుమ్రోగింది. కల్యాణనంతరం ఉభయదారులకు కండువాలతో సత్కరించి స్వామివారి ఆశీర్వాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో ఆలయం నిండుగా దర్శనమిచ్చింది.



స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త సందోహం

పార్టీ కోసం పనిచేసేవారికి మంచి రోజులు

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

కొండాపురం : పార్టీకోసం పనిచేసే కార్యకర్తలకు త్వరలో మంచి రోజులు వస్తాయని, వారులేకపోతే తాము ఈ స్థాయిలో ఉండలేమని ఎమ్మెల్యేడాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండాపురం మండల కన్వీనర్ల, గృహసారధులతో స్థానిక చౌటిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకుడు నిత్యానందరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ముంపుబాధితులకు రూ.పదిలక్షల పరిహారం ఇస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే 8 గ్రామాల ప్రజలకు రూ. పదిలక్షలు ఇచ్చామన్నారు. ఇంకా 14 గ్రామాల ప్రజలకు రూ.3.25 లక్షలు త్వరలో ఇస్తామన్నారు. ముంపు గ్రామాలలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కన్వీనర్లు, గృహ సారధులు సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలకు వివరించడంతోపాటు రాని వారికి ఎందుకు రాలేదన్న విషయాన్ని గుర్తించి వారికి న్యాయం జరిగేవిధంగా చేయాలన్నారు. వలంటీర్లు ఎవరైనా మన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవర్థించిన అటువంటి వారిని గుర్తించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 నియోజకవర్గాలలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అనంతరం నిత్యానందరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న నాయకులు ప్రతి రోజు వలంటీర్లతో టచ్‌లో ఉంటూ వారి చేసే కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. కార్యకర్తలే నాకు అన్నదమ్ములుగా భావిస్తున్నానన్నారు. మీకు కష్టం వస్తే తాను ముందు ఉంటానని కార్యకర్తలకు భరోసా కల్పించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, జడ్పీటీసీ ఎద్దు భారతి, ఎంపీపీ లక్ష్మీదేవి, ఉపమండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, హరినారాయణరెడ్డి, కోడూరు శివారెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి, రామసుబ్బారెడ్డి, వై.రామసుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, గోపినాథ్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజా ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకాంపల్లి పంచాయతీ పరిధిలోని వేపమానుసత్రం, కాంపల్లి గ్రామాల్లో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ అలాగే వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రతి లబ్ధిదారుడిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు చౌకబారు మాటలు మాట్లాడుతూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్న చేసిన సంక్షేమ పథకాలను చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు మల్లిఖార్జున యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, నాయకులు గూడ రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని మద్దిమడుగు గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ప్రతి మహిళ హక్కులను కాపాడుకోవాలి

పులివెందుల టౌన్ : హక్కులను కాపాడుకునేందుకు ప్రతి మహిళ మేలుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. బుధవారం పులివెందులలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహిళలతో కలిసి ఆందోళన చేస్తామని.. ఈనెల 20వ తేదీన అన్ని మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున మహిళలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్రంలోని మహిళలకు ఎమ్మార్పీఎస్ అండగా ఉండబోతోందని.. ఇప్పటికే పలు రాష్ట్రాలలో మహిళల మీద జరుగుతున్నటువంటి లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో హత్యలు, అత్యాచారాలు, మాన భంగాలు చూడలేకపోతున్నామని.. దీన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు రూపంలో చట్టాన్ని తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో చర్మ డప్పు కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ నాటికి పంట నమోదు చేసుకోవాలి

ముద్దనూరు : ప్రస్తుత రబీ సీజన్‌లో సాగుచేసిన పంట వివరాలను నమోదు చేసుకోవడానికి గడువు ఈనెల 10వ తేదీ అని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని, పంట నమోదు తర్వాత వాటిని పరిశీలించనున్నట్లు ఏఓ తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై చంద్రబాబు కపట ప్రేమ

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై టీడీపీ అధినేత చంద్రబాబు కపట ప్రేమ చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ అన్నారు. బుధవారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్ల కోసం చంద్రబాబు తన ఎల్లో మీడియా ద్వారా అసత్య ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీసీ కులానికి రాజ్యసభ పదవి ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా సీఎం వైఎస్ జగన్ నిలుస్తున్నారన్నారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తాం

కమలాపురం : ఖాతాదారులు మా బ్యాంకులో చేసే డిపాజిట్లకు ఇతర బ్యాంకుల కన్నా అత్యధికంగా వడ్డీ చెల్లిస్తామని డీసీసీ బ్యాంక్ నోడల్ అధికారి టీవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక డీసీసీ బ్యాంక్‌లో ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీరు మా బ్యాంకులో పెట్టే డిపాజిట్లకు అత్యధికంగా వడ్డీ చెల్లిస్తామన్నారు.డీసీసీబీ మేనేజర్ సుధీర్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ శశికళ, బ్రాంచ్ సూపర్ వైజర్ వీరశేఖర బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

వేంపల్లె : కడప డీసీసీ వేంపల్లె శాఖ బ్యాంక్ పరిధిలోని ఖాతాదారులకు ప్రభుత్వం అన్ని రకాల పథకాలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బాలాజి రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వేంపల్లె డీసీసీబీ స్థాపించి పదేళ్లు పూర్తైన సందర్భంగా ఖాతాదారులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, రిటైర్డు మేనేజర్ ధనుంజయరావు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బాలస్వామి, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ఈఓ సురేష్ కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించి రూ.1,06,263లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, దాతలు పుల్లయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

కమలాపురం : పట్టణ పరిధిలోని అప్పాయపల్లెలో వెలసిన ఎయిమ్ ఫర్ సేవ (ఛాత్రాలయం) విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఐ బసవరాజు కిరణ్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన స్నేహితులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు.

జగనన్న ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ పీడీ



ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ కృష్ణయ్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని జగనన్నకాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను బుధవారం హౌసింగ్ పీడీ కృష్ణయ్య పరిశీలించి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తదితర విషయాలపై విచారణ చేపట్టారు. వారం క్రితం హౌసింగ్ డీఈ విజయబాబు నేతృత్వంలో చేపట్టిన విచారణ నివేదిక మేరకు హౌసింగ్ పీడీ జగనన్నకాలనీలో ఇళ్లను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ డెవిడ్, మున్సిపల్ కమిషనర్ పి. జగన్నాథ్, డీఈ విజయబాబు, ఏఈ శ్రీనివాసులు, మున్సిపల్ ఏఈ సందీప్, మున్సిపల్ కౌన్సిలర్లు వార్డు ఇన్‌చార్జీలు ప్రశాంత్, షాహిద్, కో–ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ శాఖ సిబ్బంది, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి వ్యాపారస్తులకు సూచించారు. బుధవారం స్థానిక రంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న వైఎస్సార్ కూరగాయల ఆధునీకరణ పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కూరగాయల మార్కెట్ ఆధునీకీకరణ పనులు పూర్తైన సందర్భంగా ఈనెల 11వ తేదీ నుంచి కూరగాయల మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కూరగాయల మార్కెట్ మార్పు విషయం ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వైఎస్సార్ మెమోరియల్ పార్కును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాలలో కొత్తగా ఎంపికైన సచివాలయ, వార్డు వలంటీర్లకు బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ కచ్చితంగా అందేలా చూసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోలీస్‌స్టేషన్‌లో ధ్యానం చేస్తున్న పోలీసులు

పులివెందుల రూరల్ : ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని అర్బన్ సీఐ రాజు అన్నారు. బుధవారం ఉదయం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన పోలీసులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పోలీసుల విధులు ప్రతిరోజు ఒత్తిడితో కూడుకున్నదని.. ఒత్తిడిని జయించేందుకు ప్రతిరోజు ఉదయం గంటసేపు యోగ, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. యోగ చేయడంవల్ల మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చిరంజీవి, హుస్సేన్, ఏఎస్‌ఐలు చంద్రశేఖరస్వామి, రామచంద్రయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల సమస్యలు లేకుండా ఉండేందుకే భూ సర్వే



రైతులకు అవగాహన కల్పిస్తున్న డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

సింహాద్రిపురం : ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పొలాల సమస్యలు లేకుండా ఉండేందుకే భూ సర్వే నిర్వహిస్తున్నామని డివిజనల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం సచివాలయం–2లో రైతులకు మీ భూమి–మా హామీ సమగ్ర రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అరవిందనాథరెడ్డిలు హాజరై మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు తమ తమ పొలాల్లో హద్దులు ఆక్రమణలకు గురై ఉన్నా ఈ సర్వేలో బహిర్గతమవుతాయన్నారు. దీంతో భవిష్యత్‌లో ఎలాంటి భూ సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజు, వీఆర్‌ఓ రాజ కుళ్లాయప్ప, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయి

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ అలాగే వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో చేనేతల సమస్యలను గుర్తించి మగ్గం కలిగిన చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు వారి ఖాతాల్లో వేస్తున్నారన్నారు. అలాగే 55 సంవత్సరాలు కలిగిన చేనేతలకు పింఛన్ మంజూర్ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి నెల 1వతేదీ తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి తీసుకునే పరిస్థితి ఉండేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బి.రామయ్య, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ చాపాల సుబ్బరాయుడు, ఎంపీటీసీలు అలిశెట్టి కుమార్, శ్రావణి, సుంకిరెడ్డి, ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, శివ గుర్విరెడ్డి, విష్ణు, భాస్కర్‌రెడ్డి, కొండయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ జలకళ పథకం అందాలి



మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకం అర్హులైన రైతులందరికీ అందేలా చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ జలకళ నియోజకవర్గ ఇన్‌చార్జి టీపీ శివమూర్తి, జియాలజిస్టులతో కలిసి ఆయన వైఎస్సార్ జలకళ పథకంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 10 పంచాయతీలలో అర్హులైన రైతుల జాబితాను ఆయన పరిశీలించారు. అర్హులైన రైతులు పథకానికి సచివాలయంలో దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం టీపీ శివమూర్తి మాట్లాడుతూ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను ఆయా వీఆర్‌ఓల లాగిన్‌లోకి వస్తాయని.. ఆ రైతులు వివరాలతో జియాలజిస్టులు సర్వే చేసి వారి నివేదిక ప్రకారం పథకాన్ని అమలు చేస్తారన్నారు. ప్రతి రైతుకు బోరుతోపాటు మోటార్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. విద్యుత్ సౌకర్యాన్ని రైతులే ఏర్పాటు చేసుకోవాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 240 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని.. వీటిని పరిశీలించి అర్హులైన రైతులకు బోర్లు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గంగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారుల ఆరోగ్య భద్రతే ఏపీజీబీ లక్ష్యం



కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీజీబీ మేనేజర్, తదితరులు

వేముల : ఖాతాదారుల ఆరోగ్య భద్రతే ఏపీజీబీ లక్ష్యమని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖరగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కస్టమర్ మేనేజర్ ప్రేమ్ సాగర్‌తో కలిసి ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీబీ, కేర్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఖాతాదారుల భద్రత కోసం ఒప్పందం చేసుకున్నాయన్నారు. దీని ద్వారా ఖాతాదారులకు రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు తక్కువ ప్రీమియంతో హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా కేర్ ఇన్సూరెన్స్‌కు 19వేల ఆసుపత్రులలో నెట్‌వర్క్ ఉందని.. ఏ ఆసుపత్రిలలోనైనా ఖాతాదారులు వైద్య చికిత్సలు చేయించుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఇన్సూరెన్స్ పథకంపై వెలుగు సిబ్బంది గ్రామాల్లో ఖాతాదారులకు అవగాహన కల్పించడంలో చొరవ చూపాలన్నారు. అనంతరం కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్యానర్‌ను సిబ్బందితో కలిసి వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జిలాని, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

వల్లూరు : కంది పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఏ వీరయ్య అన్నారు. వల్లూరు మండలంలోని తోల్లగంగనపల్లెలో సుబ్బారెడ్డి అనే రైతు పొలంలో జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శన ద్వారా కందిలో ఎల్‌ఆర్‌జీ 105 విత్తన రకంతో బాటు కీలక ఉపకరణాలు సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాలను, సలహాలను ఇవ్వడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించారన్నారు. అనంతరం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు కొర్ర లడ్డూలు, చిరు ధాన్యాల సాగు కర పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వామి చైతన్య, టీ మహేష్‌బాబు, టి.మురళీకృష్ణ, ఎస్.రామలక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు తమ కళాశాల నుంచి వర్ష, మురళి, మంజునాథ, సాయినాథ్, పీడీ తేజేంద్రలు ఎంపికయ్యారని.. వీరు ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. వీరి ఎంపికపట్ల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

చెన్నూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో వారు పలు రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్, సిబ్బంది, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చెన్నారెడ్డి, వంశీకృష్ణ, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాసులు, ఏజీ అశోక్‌కుమార్, ఏఈఈ విజయ్ కిశోర్, ఏఈఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.